నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు అండగా ఉంటాం



వెన్నెలను సన్మానిస్తున్న నిరుద్యోగ కళాకారుల సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు అండగా ఉంటామని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆమెకు ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గద్దర్‌తో ఉన్న అనుభవాలను నెమరు వేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అంతకుముందు కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంగీత దర్శకుడు విష్ణు కిశోర్, సంఘం అధ్యక్షుడు అన్నోజు వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ఫెర్నాండెజ్ ఆసుపత్రి, శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ల మధ్య ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు చూపుతున్న డాక్టర్ ఎవిట ఫెర్నాండెజ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నవజాత శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో సహకరించేందుకు ఫెర్నాండెజ్ ఆసుపత్రి, శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ల మధ్య బుధవారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రసూతి వైద్య సహాయక విజ్ఞాన శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్మన్, ఎండీ డాక్టర్ ఎవిట ఫెర్నాండెజ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యసాయి హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఆసుపత్రి నిర్మించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

అబిడ్స్: గోషామహల్ పోలీస్‌స్టేడియంలో ఉస్మానియా హాస్పిటల్‌ను నిర్మించవద్దని పలు బస్తీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్య సమాజ్‌లైన్, కొత్తబస్తీ, లక్ష్మీనారాయణ బడా, మైసమ్మ టెంపుల్ బస్తీ, ఏసీపీ ఆఫీస్‌లైన్, గల్లీ జోషి వాడి తదితర బస్తీ వాసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. పోలీస్‌స్టేడియంలో ఆసుపత్రిని నిర్మించవద్దంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. వివిధ బస్తీల ప్రతినిధులు ఆవుల వినోద్ యాదవ్, కోటి శైలేష్, పశుపతి, వీరేందర్, అశోక్, లత మాలిక్, అరవింద్, విజయ్, దుర్గా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌కౌంటర్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జి.హరగోపాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పౌర హక్కుల నేత ప్రొఫెసర్ జీ హరగోపాల్ డిమాండ్ చేశారు. హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మృతుడు మధు సహచరి మీనాతో కలిసి ఆయన మాట్లాడారు. డిసెంబర్ 1న జరిగిన ములుగు ఎన్‌కౌంటర్‌లో వారికి అన్నంలో విషాహారం పెట్టి చిత్రహింసలకు గురిచేసి, కిరాతకంగా హత్య చేసినట్లు ప్రజల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం తెలిసిందన్నారు. మృతుల శరీరాలను గమనిస్తే కూడా అలాగే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 మంది ఉద్యమకారులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని మండిపడ్డారు. నవంబర్ 5న జరిగిన రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణ బృందానికి బయలుదేరిన వారిని అశ్వాలపేటలో నిర్బంధించారని గుర్తు చేశారు. సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నాయకుడు బల్లా రవీంద్రనాథ్, ఐఏపీఎల్ డీ సురేశ్ కుమార్, బంధుమిత్రుల సంఘం నాయకులు అంజమ్మ పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

అబిడ్స్: మాజీ సీఎం కే రోశయ్య వర్ధంతిని బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, కృష్ణకుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

చార్మినార్: రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెలను పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బహదూర్‌పూర నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్, చార్మినార్ ఇన్‌చార్జి ముజీబ్ ఉల్లా షరీఫ్ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హామీలు విస్మరించి విజయోత్సవాలా?

- జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సందీప్ సాయి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల



చార్జిషీట్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న సందీప్ సాయి తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో అన్ని వైఫల్యాలేనని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గు చేటని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సందీప్ సాయి ధ్వజమెత్తారు. నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం తేడా లేదన్నారు. ప్రభుత్వాలు మారాయే తప్ప పాలనలో మాత్రం మార్పు రాలేదన్నారు. నాంపల్లి నియోజకవర్గంలో ఎంఐఎం ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతారణాన్ని అందించాల్సిన పార్కుల్లో వాటర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసి ఎంఐఎం కార్యకర్తలకు కానుకలుగా ఇచ్చారని, వీటిపై త్వరలోనే జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా కనిపించని వ్యక్తులే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని విమర్శించారు. పార్టీ వైఫల్యాలను తప్పుదోవ పట్టించేందుకే మూసీ నది సుందరీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఆరోపించారు. నాంపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొల్లూరు పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ప్రజల్లోకి వచ్చే కొందరు ఖాన్‌లు ఉన్నారని, తర్వాత వారు మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనిపించరని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షుడు జీ అంబేద్కర్, నాంపల్లి కాంటెస్టెడ్ అభ్యర్థి రాహుల్‌చంద్ర, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్, నేతలు భుజందర్‌రావు, జగన్నాథరాజు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు అన్ని వర్గాల ఆదరణ



సీనియర్ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తున్నదని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకి మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో బుధవారం సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా పని చేయని ఏరియా కమిటీ ప్రతినిధులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలోని నానల్‌నగర్, టోలిచౌకి, లంగర్ హౌజ్, గోల్కొండ డివిజన్లలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు నిత్యం పరిశీలిస్తూ వాటి పురోగతిని తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో హారూన్‌ఫరాన్, అమీర్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ

నాంపల్లి: ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'రాష్ట్ర రాజకీయాల్లో మహిళల పాత్ర' అనే అంశంపై పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ ప్రారంభించారు. సుమారు 70 మంది విద్యార్థినులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి భవిత-పీజీ మొదటి సంవత్సరం పొలిటికల్ సైన్స్, ద్వితీయ బహుమతి ఎ.సుజాత-బీఎస్సీ-ఫిజికల్ సైన్స్, తృతీయ బహుమతి శ్రీ దుర్గా రష్మిత-బీఏ థర్డ్ సెమిస్టర్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

7 నుంచి నూతన చట్టాలపై అవగాహన

- నేటి సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలి
- నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్

సిటీ కోర్టులు: ఈనెల 7, 8 తేదీల్లో నారాయణగూడలోని సర్దార్‌పటేల్‌హాల్, కేశవ మెమోరియల్ కళాశాలలో నూతన చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నై హైకోర్టు న్యాయవాది చంద్రశేఖరన్ అలియాస్ చంద్రూ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. బీఎన్ఎస్-2023 (భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత), బీఎస్ఏ (భారతీయ సాక్ష్యా అధినియం) లపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజులపాటు ప్రత్యేక తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల న్యాయవాదులు ఈనెల 5వ తేదీలోగా సాయంత్రం 5 గంటల్లోపు నాంపల్లి బార్ అసోసియేషన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులకు భోజన వసతితోపాటు ఆహ్వాన కిట్, హ్యాండ్‌బుక్, పెన్నులు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. నూతన, పాత చట్టాలకు తేడా వాటిలో మార్పు గురించి న్యాయవాదులకు అర్థమయ్యేలా వివరిస్తారని, న్యాయవాదులు హాజరై నూతన చట్టాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా.. నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిమాయత్‌నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాలేజీ ప్రాంగణం నుంచి లిబర్టీ సర్కిల్ వరకు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ సావిత్రీ దేవి మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్, దానివ్యాప్తి, నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ర్యాలీ చేపట్టామని పేర్కొన్నారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి సేవిస్తున్న వ్యక్తికి నాంపల్లి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతి రావు 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టాకు చెందిన పాత నేరస్తుడు మహ్మద్ అస్గర్ (22) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి సేవిస్తున్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపర్చగా పూర్వ పరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు ఆలయ ప్రధాన పూజారి నల్లదీగల శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలియాబాద్‌కు చెందిన రమాదేవి బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప మహా పడి పూజ

జియాగూడ: స్థానిక సంజయ్‌నగర్‌లో గల శ్రీ నల్లపోచమ్మ, తుల్జాభవానీ ఆలయంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 9 నుంచి గురు స్వామి రామ్మోహన్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజా ప్రారంభం అవుతుందని ఆలయ ప్రతినిధులు రావుల సుదర్శన్‌రావు, శ్రీనివాస్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, అయ్యప్ప స్వామి పంచామృతాభిషేకం, అలంకరణ, భజనలు, నీలకంఠ భజన మండలి ప్రశాంత్ గురుస్వామి ద్వారా కొనసాగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అఖండ హారతి, చివరగా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

బీసీల ప్రగతికి మరిన్ని పోరాటాలు చేయాలి



బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామిని సన్మానిస్తున్న ఓయూ విశ్రాంత ప్రొ. బాలయ్య

లిబర్టీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం... ఆర్థిక ప్రగతి కోసం బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి నిరంతరం శ్రమిస్తున్నారని ఓయూ విశ్రాంత ప్రొ. బాలయ్య, ప్రిన్సిపల్ సాంబమూర్తి అన్నారు. బీసీల అభ్యున్నతికి రెండు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో కుమారస్వామికి ఆత్మీయ సత్కారం చేశారు. రానున్న రోజుల్లో బీసీల ప్రగతి కోసం పోరాటాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం లక్ష్యంగా అభివృద్ధే ధ్యేయంగా నిరంతరంగా ఉద్యమిస్తానని కుమారస్వామి భరోసా ఇచ్చారు. బీసీ బిల్లు కోసం బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు కోసం కేంద్ర స్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ కోసం నిరంతర శ్రమిస్తామన్నారు.

ఆలయ భూములను పరిరక్షించాలి



దేవాదాయ శాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వానర సేనా నాయకులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన 80 వేల ఎకరాల ఆలయ భూములను ప్రభుత్వం పరిరక్షించాలని రాష్ట్రీయ వానర సేనా డిమాండ్ చేసింది. ఈ మేరకు బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ భూములు రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వానరసేనా జాతీయ అధ్యక్షుడు నామ్ రామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారమోని గిరీశ్ మాట్లాడుతూ గో పూజ చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దేవాదాయ భూములను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఆలయ భూములు వేల ఎకరాలు కబ్జాదారుల పాలవుతుంటే దేవాదాయ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, అర్హతగల అధికారులనే ఆ శాఖలో నియమించాలని వారు కోరారు. ఫిల్మ్‌నగర్, పాతబస్తీలో ఆలయాల కబ్జా అధికంగా ఉందని వాటిపై చర్యలు చేపట్టాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాయత్రీపీఠం స్వామి శ్రీకాంత్ ఏంద్రా, మదన్‌రెడ్డి, శంకరాచార్యులు, ఉమారెడ్డి, ముఖేశ్, ఓం శ్రీను వానర సేనా నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కురాకుల కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని కార్వాన్ నియోజకవర్గ ఆ పార్టీ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. కార్వాన్ బాంజావాడీలో నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలతో పాటు రైతులకు కూడా తమ ప్రభుత్వం ఎంతో అండగా నిలిచిందన్నారు. పేద బడుగుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ మరో వైపు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రజా సంక్షేమ పథకాలు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు గజిరే కిషన్, రాములు, మహ్మద్ తదితరులు ఉన్నారు.

ఆశా కార్యకర్తలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: ఆశా కార్యకర్తలకు లెప్రసి, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కోఠి డీఎంహెచ్ఎస్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు సర్వేల పేరిట పని భారం పెంచుతున్నారని గతంలో చేసిన లెప్రసి, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించకుండానే కొత్త సర్వేలను అప్పగిస్తున్నారన్నారు. వారం రోజుల్లో పెండింగ్ డబ్బులు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు యాదమ్మ, మీనా, అనిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు చార్మినార్‌లో బైక్ ర్యాలీ, కార్నర్ మీటింగ్

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల గారడీలతో ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ తమ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గురువారం సాయంత్రం బైక్ ర్యాలీ, కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు చార్మినార్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి చార్మినార్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో పాటు కార్నర్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొగల్‌పురా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు భగవతి, నాయకురాళ్లు వీరమణి, తారకేశ్వరి పాల్గొన్నారు.

గౌలిపురా గాంధీబొమ్మ కార్యాలయం నుంచి..

గౌలిపురా: ఈ నెల5న ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గౌలిపురా గాంధీబొమ్మ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ, అనంతరం 6.30 గంటలకు ఉప్పుగూడ మంగళముఖి హనుమాన్ ఆలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మహిళా దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం



మహిళా దివ్యాంగులతో ముత్తినేని వీరయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: మహిళా దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని సంక్షేమ పథకాల్లోనూ 5 శాతం కేటాయించేలా కృషి చేస్తానని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. రవీంద్రభారతీలో మహిళా దివ్యాంగుల సాధికారత సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.300 పింఛన్ ఇసున్నదని, పదేళ్లగా పెంచకపోవడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పింఛన్ పెంచుతామని కేంద్రం ప్రభుత్వం తరఫున పెంచుతారా..? అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం పలువురు దివ్యాంగులకు బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త లయన్ మిర్యాల బాబు, సంస్థ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న (నేడు) మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జూ పార్క్ మెయిన్ రోడ్డు, రామ్నాస్ పురా, ప్రిన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఆపాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకుడు మధుసూదన్ తదితరులు



బంగ్లాదేశ్ ప్రెసిడెంట్ మహ్మద్ యూనూస్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపి వేయాలని బీజేవైఎం నగర కార్యదర్శి జొన్నకుంటి మధుసూదన్ డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వారు ఇందిరాపార్కు వద్ద బుధవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కార్వాన్ నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

సుల్తాన్‌బజార్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా జాంబాగ్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో కోఠి చౌరస్తాలో బంగ్లాదేశ్ కేర్ టేకర్ ప్రెసిడెంట్ మహ్మద్ యూనూస్ చిత్రపటాన్ని బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న దారుణ హత్యలపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. కేవలం మైనార్టీల ఓట్ల కోసమే బంగ్లాదేశ్ ఘటనపై స్పందించడం ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రఘు, రామకృష్ణ, జగపతి, వినోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.